INTERVIEW

క్యాన్సర్‌ను జల్లెడ పడుతున్నాం!



స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్

క్యాన్సర్ అన్న పదమే ఒంట్లో వణుకు పుట్టిస్తుంది. వైద్యానికి లొంగని జబ్బుగా జనం నమ్మడమే ఇందుకు కారణం. క్యాన్సర్‌కి వైద్యం కూడా ఖరీదైనదే. అన్ని చోట్లా అందుబాటులో ఉండదు. అటువంటిది శ్రీవేంకటేశ్వరస్వామి దయానుగ్రహం వల్ల తిరుపతిలో టాటా సంస్థ ఆధ్వర్యంలో అత్యాధునిక క్యాన్సర్ ఆసుపత్రి మూడేళ్లుగా నడుస్తోంది. రాయలసీమ వాసులకు ఇది వరప్రసాదం. అత్యాధునిక సాంకేతికతగల ఈ ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థకు డైరెక్టర్ బాధ్యతలను తిరుపతివాసి డాక్టర్ పి.ప్రశాంత్ నిర్వహిస్తున్నారు. ఈ క్యాన్సర్ ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవల గురించి ఆయనతో ఆంధ్రజ్యోతి సంభాషణ..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

8వ పేజీలో

● మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధించిన

అటవీ అధికారి డిస్మిస్

● నేరం రుజువై జైలు శిక్ష పడటంతో ప్రభుత్వ నిర్ణయం

తిరుపతి, జూన్3 (ఆంధ్రజ్యోతి): తన కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించి, లైంగికంగా వేధించిన అటవీశాఖ అధికారిని ప్రభుత్వం డిస్మిస్ చేసిన ఉదంతమిది. దొరవారిసత్రం మండలం నేలపట్టు బర్డ్ శాంక్చువరీలో ఫారెస్టు రేంజి అధికారిగా పనిచేస్తూ 2023లో కింది స్థాయి మహిళా ఉద్యోగి పట్ల అనుచితంగా వ్యవహరించిన బి.వరప్రసాద్ తాజాగా ఉద్యోగం నుంచీ ఉద్వాసనకు గురయ్యారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు కాగా కోర్టు ఇటీవల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో డిస్మిస్ వేటు వేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి. సూళ్ళూరుపేట వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ డివిజన్ పరిధిలోని నేలపట్టు బర్డ్ శాంక్చువరీలో ఇదివరకూ బి.వరప్రసాద్ ఫారెస్టు రేంజి అధికారిగా పనిచేశారు.ఆ సమయంలో 2023జూన్ 9న ఉదయం కార్యాలయంలో పనిచేసే ఫారెస్టు బీట్ అధికారి షేక్ అర్షత్తున్నీసాను లైంగికంగా వేధించారు. దీనిపై బాధితురాలు దొరవారిసత్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. సూళ్ళూరుపేట జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు విచారణ జరిగింది. విచారణలో అటవీ రేంజి అధికారి బి.వరప్రసాద్ నేరం రుజువు కావడంతో కోర్టు మూడు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 9న తీర్పు ప్రకటించింది. కోర్టు జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రకాశం జిల్లా మార్కాపురంలో అటవీ రేంజి అధికారిగా కొనసాగుతున్న వరప్రసాద్‌ను ఉద్యోగం నుంచీ డిస్మిస్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

కానిస్టేబుల్.. డ్రగ్స్ సరఫరాదారు!


కేసు: బాపట్ల జిల్లా అద్దంకి నుంచి హైదరాబాదుకు డ్రగ్స్ సరఫరా.

నిందితులు: హైదరాబాదులో ఐదుగురి అరెస్టు. పోలీసుల అదుపులో ఏ1 నిందితుడు. పరారీలో మరొకరు.

ఎ1 - డ్రగ్స్ సరఫరాదారు తిరుపతి రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్.

ఎ2 - తిరుపతి రూరల్ మండలం పేరూరు వైసీపీ ద్వితీయ శ్రేణి నేత ఉన్నం సురేంద్ర

హైదరాబాదు పోలీసులకు పట్టుబడిన ఆరుగురు డ్రగ్స్ ముఠాలో ఇద్దరు జిల్లా వారే. ఆ ఇద్దరూ కీలకమైన ఏ1, ఏ2 కావడం సంచలనం కలిగించింది.



● హైదరాబాదులో పట్టుబడిన నిందితుల్లో ఇద్దరిది తిరుపతి జిల్లా
● ఈ మాఫియాలో కీలకం గుణశేఖర్ ● జిల్లాలోనూ దందాలెన్నో?
● బాధిత మహిళ ఫిర్యాదుతో రూరల్‌లో కేసు



గుణశేఖర్

కేవీబీపురం మండలం ఆరె గ్రామానికి చెందిన గుణశేఖర్ 2007లో ఏపీ ఎస్పీ కానిస్టేబుల్‌గా చేరాడు. 2009లో రిజర్వు విభాగానికి బదిలీ చేయించుకున్నాడు. ఇతడి భార్య రేణుక తిరుపతిలోని ప్రసూతి ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సు. తిరుపతి రూరల్ మండలం పేరూరులోని ఆర్ఎస్ఆర్ లేఅవుట్‌లో సొంతంగా ఇల్లున్నా.. నగరంలోనే ఉంటున్నారు. తొలి నుంచీ తిరుపతి రిజర్వు యూనిట్‌లో కానిస్టేబుల్. తరచూ విధులకు ఎగ్గొట్టేవాడని, పనితీరుపైనా విమర్శలున్నట్లు అధికారులు చెబుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో ఎంపీగా గెలుపొందిన గురుమూర్తి వద్ద 2022 జూన్ 13న గన్‌మ్యాన్‌గా చేరాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేది వరకు కొనసాగాడు. ఈ రెండున్నరేళ్ల కాలంలో స్థానికంగా ఇతడి అవినీతి అక్రమాలకు అంతే లేకుండా పోయిందన్న విమర్శలున్నాయి. ప్రధానంగా అప్పట్లో భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసేవాడని.. ఎవరైనా ఉద్యోగాల కోసం ఎంపీ వద్దకు వస్తే, వారితో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. టీటీడీలో దర్శనాల విషయంలోనూ, ఇతరత్రా పనులు చేసిపెడతానంటూ నగదు వసూలు చేసినట్లు తెలిసింది. తనతోపాటు పనిచేస్తున్న పలువురు కానిస్టేబుళ్ల వద్ద డబ్బు తీసుకుని ఎగ్గొట్టినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఎర్రచందనం అక్రమ రవాణా, గంజాయి దందాలోనూ ఇతడు భాగస్వామి అయినట్లు తెలిసింది. ఈ క్రమంలో కొందరు వైసీపీ నేతల సహకారం ఇతడికి ఉన్నట్లు ప్రచారంలో ఉంది. అదే సమయంలో తిరుపతి రూరల్ పేరూరు ప్రాంతానికి చెందిన వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు ఉన్నం సురేంద్రతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి పలు అక్రమ వ్యాపారాలు సాగించారు.

సెలవుల్లో డ్రగ్స్ సరఫరా!

ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఎంపీ గన్‌మ్యాన్‌గా వెనక్కి వచ్చిన గుణశేఖర్ నుంచి వెన్నునొప్పి అంటూ అదే నెల 26 నుంచే మే 17వ తేది వరకు సిక్ లీవు పెట్టాడు. ఆ తర్వాత బావమరిది వెంకటేష్ పెళ్లి ఉందంటూ మే 31 నుంచి జూన్ 9 వరకు లీవులో వెళ్లాడు. ఇలా సెలవు పెట్టి సురేంద్ర, మరికొందరితో కలిసి తన అక్రమ వ్యాపారాన్ని డ్రగ్స్‌వైపు మళ్లించినట్లు ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే కొకైన్, ఇతర డ్రగ్స్‌తో గుణశేఖర్ బ్యాచ్ హైదరాబాదు పోలీసులకు పట్టుబడింది.

డ్రగ్స్ దందాపై అత్యున్నత విచారణ జరపాలి

అంతరాష్ట్ర డ్రగ్స్ మాఫియా కేసులో అత్యున్నత స్థాయి విచారణ జరిపించాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రికి లేఖ రాసినట్లు తిరుపతి ఎంపీ గురుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుణశేఖర్ డ్రగ్స్ వ్యవహారంలో పట్టుబడితే.. కొన్ని నెలలుగా తన వద్ద విధుల్లో లేని వ్యక్తికి సంబంధించిన వ్యవహారాన్ని తనకు అంటకట్టడం టీడీపీ దగాకోరు విధానానికి నిదర్శనమన్నారు. తన వద్ద గన్‌మ్యాన్‌గా పనిచేసిన గుణశేఖర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 26న విధుల నుంచి వెనక్కి పంపించేశానని.. ఈ రికార్డులు ప్రభుత్వం వద్ద ఉన్నాయని గుర్తు చేశారు. తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాడతానన్నారు.

రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్ నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఎంపీ గురుమూర్తి తన వద్ద గన్‌మ్యాన్‌గా వద్దని చెప్పి వెనక్కు పంపారని అధికారులు చెబుతున్నారు.

స్థలం అమ్ముతామంటూ మోసం

● రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్ దంపతులపై కేసు

స్థలం అమ్ముతామంటూ డబ్బు తీసుకుని మోసం చేశారన్న ఫిర్యాదుపై తిరుపతి రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్, ఆయన భార్య రేణుకపై మంగళవారం కేసు నమోదైంది. 'ప్లాట్ విక్రయిస్తామని చెప్పి రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్, ఆయన భార్య రేణుక కలసి గతేడాది మార్చిలో రూ.22 లక్షలు తీసుకున్నారు. ఇప్పటి వరకు స్థలం రిజిస్ట్రేషన్ చేసివ్వలేదు. చాలాసార్లు వారి ఇంటికెళ్లి అడిగినా సరైన సమాధానం రాలేదు. తీసుకున్న డబ్బులు ఇవ్వకపోగా, ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసివ్వక పోవడంతో మోసపోయామని గుర్తించాం' అంటూ తిరుపతి రూరల్ మండలం పేరూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన తుంగ లక్ష్మి రెడ్డెమ్మ సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ చిన్నగోవిందు ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్ దంపతులపై మంగళవారం కేసు నమోదు చేశారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

'తోతాపురి' @ రూ.12 వేలు

● మద్దతు ధర ప్రకటించిన కలెక్టర్



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు, మామిడి గుజ్జు పరిశ్రమ యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చల అనంతరం తోతాపురి మామిడికి మద్ధతు ధర టన్ను రూ.12వేలు నిర్ణయించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్‌మోహన్, మురళీమోహన్, మామిడి రైతు సంఘం నాయకులతో వర్చువల్ విధానంలో సమీక్షించి తోతాపురి మామిడికి మద్దతు ధర నిర్ణయించారు. మామిడి రైతులు, మామిడి పల్ప్ పరిశ్రమ యాజమాన్యం ఇద్దరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తోతాపురికి రూ.12వేలు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం, మామిడి మండీర్యాంపుల వారు కొనుగోలు చేయాలన్నారు. మామిడి మండీ ర్యాంపులలో కూడా రైతులకు గిట్టుబాటు ధర లేకుండా తక్కువ ధరకు కొంటున్నారన్నారు. దీని ప్రకారం వ్యాపారులు కొనుగోలు చేయాలన్నారు. తోతాపురి మామిడి రకానికి గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రైతులకు తొలి ప్రాధాన్యం ఇచ్చినట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. తమిళనాడు ప్రభుత్వంతో మామిడి గిట్టుబాటు ధరపై చర్చించినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా మామిడి పరిశ్రమ చర్యలు తీసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కోరారు. అదే విధంగా రైతులు పల్ప్ ప్రాసెసింగ్‌కు సహకరించాలన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల యాజామాన్యాలు పరిశ్రమల నిర్వహణలో ఉన్న సమస్యలను తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సాయం సంధ్యవేళ.. అటు పక్షులు గూడుకు, ఇటు సూరీడు అస్తమిస్తున్న ఈ దృశ్యం తిరుపతిలో మంగళవారం సాయంత్రం కనిపించింది.

శ్రీకాళహస్తి టౌన్ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి గడువు పొడిగింపు

తిరుపతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి గడువును ప్రభుత్వం మరో ఆరు నెలల పాటు పొడిగించింది. ఈ బ్యాంకు పాలకవర్గానికి ఎన్నికలు జరగని నేపధ్యంలో ప్రభుత్వం గతంలో అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జిని నియమించింది. ఆ నియామకానికి సంబంధించి గడువు గత నెల 28వ తేదీతో ముగిసింది. దీంతో ప్రభుత్వం గత నెల 29వ తేదీ నుంచీ ఈ ఏడాది నవంబరు 28వ తేదీ వరకూ ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతులకు సంబంధించి 2025-26 విద్యా సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో బాలాజీ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 19వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. బాలురకు 40, బాలికలకు 40 సీట్లు ఉన్నాయి. 4వ తరగతి అభ్యర్థులు 8నుంచి 10 సంవత్సరాల మధ్య ఉండాలి. 5వ తరగతి అభ్యర్థులు 9నుంచి 11సంవత్సరాలు మధ్య ఉండాలి. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా జారీచేసిన జనన ధ్రువీకరణ పత్రం, ఒరిజినల్ డాక్యుమెంట్లు, వైద్యపరీక్షల్లో పాసైన ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. మరిన్ని వివరాల కోసం 9849014639నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కాళ్లు, చేతులు కట్టేసి దోపిడీ



దామినేడు వద్ద కార్ల షోరూములోని సీసీ పుటేజీ

● తిరుపతిలోని కార్ల షోరూములో రూ.7 లక్షల అపహరణ
● ఘటనా స్థలం పరిశీలించిన పోలీసు బృందాలు
● ఉత్తరాది ముఠాగా అనుమానం
● మూడు బృందాలు ఏర్పాటు చేసిన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాళ్లు, చేతులు కట్టేశారు. షోరూములోని రూ.7 లక్షలు దోపిడీ చేసుకెళ్లారు. ఈ ఘటన తిరుపతి నగరం రేణిగుంట రోడ్డులోని భార్గవి ఆటోమొబైల్స్ (మారుతీ షోరూం)లో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. క్రైం పోలీసుల కథనం మేరకు.. ముఖాలకు ముసుగు వేసుకున్న నలుగురు యువకులు మంగళవారం తెల్లవారుజామున షోరూమ్‌లోకి ప్రవేశించారు. లోపలున్న సేల్స్ ఎగ్జిక్యూటివ్ బాలాజీ చేతులు, కాళ్ళు కట్టేశారు. మేనేజర్ రూములోకి చొరబడ్డారు. అక్కడ రూ.7 లక్షలున్న చిన్న లాకర్ తీసుకెళ్లారు. ఆ తర్వాత కట్లు విడిపించుకుని బాలాజీ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు రాంకిషోర్, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ నలుగురు దొంగలకు 25 నుంచి 35 ఏళ్ల ఉంటాయి. వీరు హౌస్ బ్రేకింగ్‌లో ఆరితేరిన వారు. ఈ నలుగురు రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వచ్చి షోరూమ్ వెనుక వైపు నుంచి లోపలకు ప్రవేశించినట్లు భావిస్తున్నారు. హిందీ స్పష్టంగా మాట్లాడుతుండటంతో.. ఉత్తరాదికి చెందిన ముఠాగా అనుమానిస్తున్నారు. పరిసరాల్లో తనిఖీ చేసిన పోలీసులకు రైల్వే ట్రాక్‌పై పగులకొట్టి ఉన్న లాకర్ కనిపించగా దాన్ని సీజ్ చేశారు. షోరూములోని ముఖ్యప్రాంతాల్లో వేలి ముద్రల నిపుణలు వేలి ముద్రలు సేకరించారు. పాత నేరస్థుల వేలిముద్రలను పరిశీలించి.. ఈ ఘటన వెనుక వున్న దోపిడీ ముఠా ఎవరై ఉంటారనే కోణంలో దర్యాప్తు సాగించనున్నారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. అక్కడ వున్న సీసీ కెమెరాలు పరిశీలించి ఫుటేజీ సేకరించారు. తిరుపతి క్రైం సీఐ శివకుమార్ రెడ్డి కేసు నమోదు చేశారు. కాగా, దామినేడు వద్ద ఉన్న ఓ కారు షోరూములోనూ సోమవారం వేకువజామున చోరీకి యత్నించి సెక్యూరిటీని నిర్బంధించారు. ఈ దోపిడీ ఘటనల నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధనరాజు సీరియస్‌గా స్పందించారు. అనుమానం వున్న వారి కోసం మూడు పోలీసు బృందాలను నియమించారు. వీరు తిరుమల, తిరుపతి, చెన్నైతో పాటు విజయవాడ, హైదరాబాదుకు వెళ్ళినట్లు తెలిసింది.

అధికారులతో సమీక్ష

జిల్లా అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు ప్రసాద్, భక్తవత్సలం, శ్యాంసుందర్‌తో ఎస్పీ హర్షవర్ధనరాజు తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. దోపిడీ దొంగల ఆచూకీ గుర్తించి అరెస్టు చేయాలని క్రైం పోలీసులను ఆదేశించారు. గతంలో సీపీఆర్ విల్లాస్‌లో జరిగిన దొంగతనాలపైనా సమీక్ష చేసిన ఎస్పీ.. ఆ కేసు ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. ఎస్పీ అడిగిన ప్రశ్నలకు కొందరు పోలీసు అధికారులు నోరు మెదపనట్లు తెలిసింది. స్మార్ట్ వర్కు చేసి ఫలితాలు రాబట్టాలని సూచించారు.



దోపిడీ జరిగిన మారుతీ షోరూమును పరిశీలిస్తున్న పోలీసులు

వైభవంగా గంగమ్మ జాతర


సారె తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పద్మావతిపురం పంచాయతీలో మంగళవారం వైభవంగా గంగమ్మ జాతర జరిగింది. ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆయనకు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నారికేళ గంగమ్మకు భక్తజన నీరాజనాలు



చంద్రగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిట్టమీద గంగమ్మ జాతర పురస్కరించుకుని మంగళవారం నారికేళ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. తర్వాత కొబ్బరికాయలతో అలంకరించి దర్శనం కల్పించారు. ఈసందర్భంగా చంద్రగిరిలోని భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు. పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చంద్రగిరి కోటలో యోగాంధ్ర


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో సుమారు 3 వేలకు పైగా పాల్గొననున్నారు. ఈసందర్భంగా కోట ఆవరణలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం టూరిజం జిల్లా అధికారి జనార్థన్‌రెడ్డి, ఏపీటూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, ఆర్కియాలజీ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. యోగాంధ్ర కార్యక్రమం బుధవారం ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు జరగనుంది. కలెక్టర్ వెంకటేశ్వర్, చ.ఎమ్మెల్యే పులివర్తి నానిలు హాజరుకానున్నారు.

ఏనుగుల కట్టడిపై రైతులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

భాకరాపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జీవ వైవిద్యంలో సమతుల్యత పాటించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఆర్డీవో రామ్మోహన్ అన్నారు. చిట్టేచర్లలో ఏనుగుల కదలికలు, తీసుకోవల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామ్మోహన్ మాట్లాడుతూ లైట్ల వాడటం వల్ల ఏనుగులు చికాకుతో దాడి చేస్తాయన్నారు. వాటిని గాయపర్చకుండా సాకేంతిక పరికరాలతో శబ్దాలు చేయాలన్నారు. జీపీఎస్ సహాయంతో కదలికలను కనిపెట్టాలన్నారు. బాధిత రైతుకుల నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకొంటామన్నారు. రైతులు మాట్లాడుతూ అటవీ సరిహద్దు ప్రాంతంలో ట్రెంచులు ఏర్పాటు చేయాలని, సోలార్ పెన్సింగ్ ఏర్పాటు పరిశీలించాలని కోరారు. తహసీల్దార్ జనార్దన్‌రాజు, రేంజర్ వెంకటరమణ, ఎంపీడీవో గిడ్డయ్య, ఎస్ఐ రాఘవేంద్ర, సర్పంచ్ నాగచెంగమనాయుడు, ఈవోఆర్డీ సోమశేఖర్, టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లకొండ మురళి పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయండి:వైసీపీ



మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి

చంద్రగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. చంద్రగిరిలో మంగళవారం వైసీపీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంటు వైసీపీ పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా భూమన మాట్లాడుతూ . కూటమి ప్రభుత్వం వైసీపీని నాశనం చేయాలని చూస్తోందన్నారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని హామీలను నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దే రేషన్

భాకరాపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు సరఫరా చేస్తారని తహసీల్దార్ జనార్దన్‌రాజు తెలిపారు. అంగవైకల్యం చెందినవారు, మంచానికే పరిమితమైనవారు, 65 ఏళ్ల వయస్సు పైబడిన వారికి ఇంటి వద్దే రేషన్ సరఫరా చేస్తారన్నారు. ఆయా గ్రామాల డీలర్లు అలాంటివారిని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు 20మంది ఎంపిక


సర్టిఫికెట్లు అందుకున్న క్యాడెట్లతో కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే

రామచంద్రాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే ఎన్‌సీసీ శిక్షణా తరగతులకు20మంది సీనియర్ వింగ్ క్యాడెట్లను ఎంపిక చేశారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండెట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే ఈమేరకు తెలిపారు. సి.రామాపురంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్ ఆవరణలో ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా రాజగోపాల్ జగదీష్ ఆత్రే మాట్లాడుతూ క్యాడెట్లకు యోగా, అగ్ని ప్రమాదాపై నివారణ, చిత్రలేఖనం, ఆటలు, ఆర్మీ, ఎయిర్‌వింగ్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతిబ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశామన్నారు. తిరుపతి, నెల్లూరు, అన్నమయ్యచిత్తూరు, కడప జిల్లాల నుంచి 509 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఇందులో పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాంపు పర్యవేక్షకుడు గుణశేఖర్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడి మృతి


మృతుడు సతీష్

చంద్రగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో భారత్ పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు చనిపోయాడు. పోలీసుల కథనం మేరకు చంద్రగిరి పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన సతీష్(29) జేసీబీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. భార్య, కుమారుడు ఉన్నారు. మంగళవారం ఉదయం 10గంటలకు ఇతడు ద్విచక్ర వాహనంపై అగరాల నుంచి ఇందిరమ్మ కాలనీకి సర్వీసు రోడ్డులో భారత్ పెట్రోల్ బంకు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన చిత్తూరు మునేంద్ర

తడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. దొరవారిసత్రం మండలం ఉచ్చూరు గ్రామానికి చెందిన చిత్తూరు మునేంద్ర (25) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పనిమీద మంగళవారం ఉదయం బైక్‌పై తమిళనాడు ఆరంబాకంకు వెళ్లాడు. అక్కడ పనిచూసుకొని తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో తడ బోడిలింగాలపాడు మలుపువద్ద అదే దారిలో తిరుపతి నుంచి చెన్నైకు వెళ్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా మలుపుతిరిగింది. దీంతో వెనుక వస్తున్న మునేంద్ర బైక్ కంట్రోల్ చేసుకోలేక బస్సు వెనుక టైరువద్ద ఢీ కొట్టుకొని టైరు కిందకు వెళ్లిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో చెన్నై-నెల్లూరు జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న తడ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. ఈ ఘటన శ్రీకాళ హస్తి పట్టణ శివార్లలోని తుఫాన్ సెంటర్ ఎస్టీకాలనీ సమీపంలో కైలాసగిరి కొండల్లో అల్లిమడుగు వద్ద మంగళవారం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు సుమారు 5రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు.

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుని వివరాల కోసం ఆరా తీశారు. నలుపు రంగు టీషర్టు, షార్ట్ ధరించి ఎడమచెవికి కమ్మ ఉన్నట్లు ఆనవాలు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని వేణుగోపాలపురం శ్మశాన వాటికలోని ముళ్లపొదల్లో చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకి దించి పరిశీలించారు. వివరాలు ఏవీ లభ్యం కాలేదు. కాగా గుర్తు తెలియన వ్యక్తి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, ఎర్ర నిక్కరు, తెల్లషర్టు వేసుకుని ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు రామచంద్రయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని రామలింగాపు రానికి చెందిన రామచంద్రయ్య సొంత పనుల నిమిత్తం మంగళవారం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో మిట్టకండ్రిగ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామచంద్రయ్యను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. 1వ పట్టణ పోలీసులు ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గావీధిలోని హజరత్ సయ్యద్ హసీం ఉస్సేనీ రహంతుల్లా ఔలియా దర్గాలో సోమవారం రాత్రి గంధ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధాన్ని ఊరేగింపుగా దర్గావద్దకు తీసుకువచ్చి మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హసీమ్ ఉస్సేనిబాబా సమాధికి గంధ లేపనం జరిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, మగ్దూం, సిరాజ్‌అహ్మద్, ఇలియాజ్, యస్థానీ, దిల్దార్, ఖమర్, రెహమాన్ పాల్గొన్నారు.

ఇసుకాసురుల గుండెల్లో గుబులు


స్వర్ణముఖి నదిలో జేసీబీలో ఇసుక అక్రమ తవ్వకాలు

తిరుపతి రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ఇసుకాసురులతో స్వర్ణముఖినది స్వరూపాన్నే కోల్పోయిన తీరుపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దోపిడీ గుట్టును వెలికి తీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పలుగ్రామాల మీదుగా ప్రవహించే స్వర్ణముఖిని వైసీపీ హయాంలో ఐదేళ్లూ ఇసుకాసురులు చెరబట్టారు. భారీ యంత్రాలతో రేయింబవళ్లు పరిధికి మించి తవ్వేశారు. దీంతో నదిపొడవునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి చెరువులను తలపిస్తున్నాయి. మధ్యభాగం వరకూ టిప్పర్లు, ట్రాక్టర్లు చేరుకునేందుకు దారిని కూడా ఏర్పాటు చేసుకుని మరీ దోపిడీకి పాల్పడ్డారు. గొల్లపల్లె నుంచి చిగురువాడ, దుర్గసముద్రం, తనపల్లె, పాడిపేట వరకూ కాంట్రాక్టు కంపెనీలు నకిలీబిల్లులతో ఇష్టారీతిన దోపిడీకి పాల్పడినా మైనింగ్, రెవెన్యూ, సెబ్ అధికారులు పట్టించుకోలేదన విమర్శలున్నాయి.

ఆగని తవ్వకాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక యంత్రాలు లేకుండా మనుషులే తవ్వుకుని ట్రాకర్ల ద్వారా తరలించేలా ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చింది. ఇప్పటికే నాణ్యమైన ఇసుకను తవ్వేయడం, ఏడాదిగా వాగుపారకపోవడంతో నిర్మాణదారులకు మంచి ఇసుక దొరకడం లేదు. మరోపక్క వైసీపీ హయాంలో పెట్రేగిపోయిన ఇసుక మాఫియా కూటమి ఇప్పుడూ అదే తరహాలో వ్యవహరిస్తున్నారు. గాంధీపురం పంచాయతీలో ఇసుక నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసినా కొన్ని రోజులుగా ఇసుక దొరకడంలేదు. దీంతో ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఇసుక మాఫియా యంత్రాలతో తవ్వేస్తోంది. రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్‌ను వివరణ కోరగా నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలని సీజ్ చేస్తామన్నారు. మండలపరిధిలో అధికారులతో టీమ్స్‌ని ఏర్పాటు చేశామన్నారు.

తిరుమల మఠాల్లో భద్రతపై దృష్టి

మఠాల నిర్వాహకులతో డీఎస్పీ విజయ్‌శేఖర్


మఠాల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

తిరుమల, జూన్3(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ప్రతి మఠంలోనూ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్ మఠాల నిర్వాహకులను ఆదేశించారు. ప్రస్తుతం దేశంలో నెలకొనిఉన్న పరిస్థితుల నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులతో పాటు క్షేత్ర భద్రత కల్పనలో మఠం నిర్వాహకులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. తిరుమలలోని పోలీసు కాంప్లెక్స్‌లో సీఐలు విజయ్‌కుమార్, శ్రీరాముడుతో కలిసి తిరుమలలోని మఠాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం తిరుమలలో 32 మఠాలు ఉన్నాయని, ప్రతి మఠంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి మఠం వద్ద ఓ సెక్యూరిటీ గార్డ్ 24 గంటలు ఏర్పాటు చేయాలన్నారు. మఠానికి వచ్చేవారిని, వారి లగేజీని ఆ గార్డు తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. అనుమానస్పదంగా అనిపిస్తే పోలీసులు, విజిలెన్స్ విభాగాలకూ సమాచారమివ్వాలన్నారు. మఠానికి ఉండే అన్ని మార్గాలను మూసివేసి కేవలం ఒక మార్గం ద్వారానే రాకపోకలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలను తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. మూడునెలకోసారి సీసీ కెమెరాల ఫుటేజీను పోలీసులకు అందజేయాలని, ఎప్పటికప్పుడు బ్యాకప్ ఉంచుకోవాలన్నారు. మఠానికి వచ్చే వారి వ్యక్తిగత వివరాలు ఉంచుకోవాలన్నారు. వర్కర్స్‌ను కూడా పూర్తి స్థాయిలో విచారించిన తర్వాతే పనిలోకి తీసుకోవాలని సూచించారు. నిబంధనలను పాటించకపోతే మొదటితప్పుగా రూ.5 వేల జరిమానా ఉంటుందని, తర్వాత కూడా నిర్లక్ష్యం వహిస్తే మూసివేస్తామని హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


పూజా సామగ్రిని తీసుకువస్తున్న అధికారులు, అర్చకులు

వడమాలపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 7 నుంచి 15వరకు నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ నలుమూలలా శుద్ధి చేశారు. నిత్య కైంకర్యాలు, సేవల అనంతరం ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితర వస్తువులను నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం తదితర సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో శుద్ధి చేశారు. కార్యక్రమంలో ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో రవికృష్ణ, సభ్యులు గోపాల్, శ్రీరంగ, ఆలయ అర్చకులు వాచస్పతి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి నేడు బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా బుధవారం ఉదయం 11 - 12 గంటల మధ్య మరోమారు అమాస రాజశేఖర రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈ సందర్భంగా బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు తదితరుల కటౌట్లు ఏర్పాటు చేశారు.టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రముఖులందరికీ ఆహ్వానాలు పంపారు.ఈనెల 26వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత ఏడుగురు డైరెక్టర్లతో కూడిన పాలకవర్గం రానుంది.నిజానికి డీసీసీబీతో అమాస రాజశేఖర రెడ్డికి సుదీర్ఘమైన అనుబంధముంది. 2006లో జరిగిన ఎన్నికల్లో గెలుపొంది 2011 వరకు, 2011 నుంచి 2016 వరకు మరోసారి ఎన్నికై పదేళ్ళపాటు ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించకపోవడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆయన పాలకవర్గాన్ని మరో మూడేళ్ళపాటు కొనసాగించింది. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో పాలకవర్గం వైదొలగింది.

చిత్తూరు మండీలకు పోటెత్తిన కాయలు

● ఎగుమతులతో లాభసాటి ధరలు


గుజరాత్ వ్యాపారితో ధరలపై మాట్లాడుతున్న ఏడీ పరమేశ్వరన్

చిత్తూరు సెంట్రల్,జూన్3(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మండీలకు మంగళవారం మామిడి కాయలు పోటెత్తాయి. గత వారం మొదట్లో రోజుకు కేవలం 4-10 టన్నుల మధ్య కాయలు వచ్చాయి. సోమవారం 200 టన్నులు రాగా, మంగళవారం 275టన్నుల దాకా వచ్చాయి.కాయలు నాణ్యంగా ఉండడంతో మంగళవారం గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు మామిడి ఎగుమతి చేశారు.మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ మండీకి వచ్చిన మామిడి రకాలను,నాణ్యతను పరిశీలించారు. మండీల యజమానులు, ఎగుమతిదారులతో ధరలపై చర్చించారు. రైతులకు లాభసాటి ధరలు వచ్చేలా చర్యలు చేపట్టారు. వర్షాలు ఆలస్యం కావడం మామిడి రైతులకు అనుకూలంగా మారింది. ఈదురుగాలులతో రాలిన కాయలతో నష్టం వాటిల్లినా, కూలీల సాయంతో కోసిన మామిడికి ధర బాగానే పలికింది. బంగారుపాళ్యం మండీలకు మంగళవారం 50 టన్నుల వరకు మామిడి రాగా, వచ్చే వారంలో అధికంగా వస్తుందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

చిత్తూరు మండీలో మామిడి ధరలు

రకం	టన్ను ధర (రూ.వేలల్లో)
బేనీషా	18-25
తోతాపురి	8(పచ్చి కాయలు)-13(దోర కాయలు)
పుల్లూర	8-10
మల్లిక	30-40
ఇమాంపసంద్	60-75
కాలేపాడ్	30-40

కోతల మామిడికి ధర బాగుంది

కూలీల సాయంతో చెట్ల నుంచి కోసిన కాయలకు ధర అధికంగా పలికింది. కాయలు బరువుగా, నాణ్యంగా వుండడంతో ధర వచ్చింది. రాలిన కాయలు, దోటితో కోసిన కాయలు దెబ్బతిని, పురుగుపట్టడంతో ధర పలకడం లేదు. కోతల్లో జాగ్రత్తలు పాటించి మండీలకు తెస్తే గిరాకి బాగుంది.

- కృష్ణమూర్తి నాయుడు, మండీ యజమాని





వేడుకగా గంగమ్మ మూడవ మరు పొంగళ్లు

వేషధారణలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ మూడవ మంగళవారం మరు పొంగళ్ల కార్యక్రమం వేడుకగా సాగింది. ఉదయం నుంచి రాత్రి దాకా భక్తుల సందడి కనిపించింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వివిధ వేషధారణలతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఈవో జయకుమార్ పర్యవేక్షించారు.



పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తిచేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 56 ప్రాజెక్టులు ఉన్నాయని వాటి ద్వారా లక్షల ఎకరాల భూమికి సాగునీటిని అందించవచ్చన్నారు. చిత్తూరు జిల్లాలో గాలేరు-నగరి, హంద్రీ-నీవాను పూర్తిచేయాలన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టుకు సంబంధించి కాలువ సామర్థ్యం సరిపోద న్నారు. ప్రస్తుతం లైనింగ్ పనులు చేస్తున్నారని ఆ పనులు ఆపేసి ముందు కాలువను వెడల్పు చేయాలని కోరారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు న్యాయం జరగాలంటే గాలేరు- నగరి, హంద్రీ-నీవా అను సంధానం జరగడం చాలా ముఖ్యమన్నారు. సీఎం చంద్రబాబు వీటిపై దృష్టిసారించాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో కుమార్‌రెడ్డి, గుర్రప్ప, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధిగా బుజ్జిబాబు



తిరుపతి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధిగా ఆవుల పాటి బుజ్జిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈయన నాయీబ్రాహ్మణ సేవా సంఘం ద్వారా చేసిన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

టౌన్ బ్యాంక్ ఖాతాదారులకు యూనివర్సల్ ఏటీఎం కార్డులు

తిరుపతి(ఆటోనగర్) జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ బ్యాంక్ ఖతాదారులకు యూనివర్సల్ ఏటీఎం కార్డులు పంపిణీ చేస్తున్నామని బ్యాంక్ చెర్మన్ కేతం జయచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. జాతీయ బ్యాంక్‌లు ఖాతాదారులకు అందిస్తున్న ఆధునిక సాంకేతిక వసతులను తమ ఖాతాదారులకు అందిస్తున్నామని వివరించారు. బ్యాంక్ ఎండీ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ బ్యాంక్ ఏటీఎం కార్డులు అన్ని జాతీయ బ్యాంకుల ఏటీఎంలలో వినియోగించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాగు చోరీ

తిరుపతి(నేరవిభాగం) జూన్ 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం వద్ద ఓ భక్తుడి బ్యాగు చోరీకి గురైంది. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం పాలి గ్రామానికి చెందిన వెలగల రామకృష్ణారెడ్డి కుమార్తె లలితసాగరితో కలసి గతనెల 30న తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనం అనంతరం ఈ నెల రెండున తిరుపతికి చేరుకున్నారు. గోవిందరాజస్వామి ఆలయం వద్ద మంగళవారం విశ్రాంతి తీసుకునే సమయంలో వారి బ్యాగు కనిపించలేదు. బ్యాగులో రూ.50వేల విలువైన మొబైల్, రూ.2000 నగదు ఉన్నాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

గంగమ్మ ఆలయానికి వెండి పాదాల విరాళం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయ బలిపీఠం వద్ద పాదాలకు వెండి తొడుగులను మునిశేఖరరెడ్డి, పద్మావతి దంపతులు అందజేశారు. రూ. 6 లక్షల 50 వేల విలువ చేసే ఈ వెడి తొడుగులను ఆలయాధికారులకు దాతలు బహూకరించారు. ఆలయాధి కారులు దాతలను సత్కరించారు.

'అవినీతి సొమ్మును వెనక్కు ఇవ్వగలవా..? '

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీలో వెనకేసు కున్న అవినీతి సొమ్మును మాజీసర్పంచ్ గణపతినాయుడు వెనక్కు ఇవ్వగలరా అని వెంకటపతి నగర్ సర్పంచ్ చిన్నియాదవ్ ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో నమ్మకంగా ఉండి నేడు పార్టీ మారగానే నీతులు వల్లించడం విడ్డూరంగా ఉంద న్నారు. ఈ సమావేశంలో పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, రూరల్‌మండల అధ్యక్షులు మునీశ్వర్‌రెడ్డి, నాయకులు వాసు, దేవ పాల్గొన్నారు.

రేషన్ ఎక్కడైనా తీసుకోండి: టీడీపీ



రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న సుగుణమ్మ, నరసింహయాదవ్, పనబాకలక్ష్మి తదితరులు

తిరుపతి, జూన్6(ఆంధ్రజ్యోతి): ఏ చౌక దుకాణంలోనైనా రేషన్ తీసుకునే వెసులుబాటు ఉంటుందని టీడీపీ నేతలు అన్నారు. మంగళవారం తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సుగుణమ్మ ఆధ్వర్యంలో సుందరయ్య నగర్‌లోని చౌక దుకాణం వద్ద సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబెర్ పనబాకలక్ష్మి, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, 43వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జి శీనివాసులు, ఊట్ల సురేంద్ర నాయుడు, మునిశేఖర్ రాయల్, వార్డు నాయకులు శ్రీను, వెంకట్‌రెడ్డి, నళిని, చౌకదుకాణాల సంఘ నాయకులు సి వెంకటేష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ శ్రీనాథ్, పావని, రమణ పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ జాతర



శ్రీకాళహస్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో కొలువై ఉన్న బంగారమ్మ ఆలయంలో మంగళవారం జాతర వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకించారు. ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అంబలి పోశారు. ఉదయం 9గంటలకు గెరిగ ఉత్సవం ప్రారంభించారు. వాయిద్యాలన నడుమ గ్రామోత్సవం చేశారు. ఉదయం మైలు ముగ్గు, మధ్యాహ్నం పోతురాజు ముగ్గు వేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ వనమాల నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం: వైసీపీ

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని బుధవారం విజయవంతం చేద్దామని వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలను ఇస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని విస్మరించి ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు సారథి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘనస్వాగతం



విమానాశ్రయంలో కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. స్వాగతం పలికిన వారిలో బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, చంద్రగిరి బీజేపీ ఇన్‌చార్జి పురుషోత్తమనాయుడు, మహేష్, ఖాదర్, పీలేరు నాయకులు చిన్న, పుష్పరాజ్, బాబు తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన స్వగ్రామమైన నగరిపల్లికి బయలుదేరి వెళ్లారు.

గుండెపోటు దినం ప్రకటించాలి

వైసీపీ వెన్నుపోటు దినంపై మండిపడ్డ టీడీపీ, జనసేన నేతలు





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్, కిరణ్‌రాయల్

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం కన్నా ముందు గుండెపోటు దినం ప్రకటించాలని జనసేన నేత కిరణ్‌రాయల్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ వెన్నుపోటు దినం నిర్వహించ నుండడంపై ఆయన మాట్లాడారు. చెల్లికి, అమ్మకి, విజయసాయిరెడ్డి జగన్ వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. అలాంటి వారు వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాబాయ్ గుండెపోటుతో చనిపోయారని తొలుత ప్రచారం చేశారని గుర్తుచేశారు. అందుకే గుండెపోటు దినంపై డబ్ల్యూహెచ్‌వోకు రాష్ట్ర ప్రజల తరఫున లేఖ రాశామన్నారు. ఎయిడ్స్‌డే, క్యాన్సర్‌డే వలే గుండెపోటు దినం ప్రకటించాలని కోరామన్నారు. తెనాలి పర్యటనలో ఉన్మాదులకు జగన్ మద్దతు తెలపడం శోచనీయమన్నారు. అవకాశం ఉంటే ఉగ్రవాదులను సైతం పరామర్శిస్తారని ఎద్దేవా చేశారు. జనసే నాయకులు మనోజ్, హరీష్, కిషోర్‌రెడ్డి, సునీల్, సాయి, పురుషోత్తం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం సుపరిపాలన

జనసేన పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించిందని తెలిపారు. మంచి పాలన అందించిన శుభసందర్భంగా పవన్ కల్యాణ్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం పండుగ వాతా వరణం నెలకొనేలా 'పీడ విరగడై ఏడాది' పేరుతో కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు బాబ్జి, మధుబాబు, దినేష్ పాల్గొన్నారు.

ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌ది

టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడుతూ అబద్ధాలతో వెన్నుపోటు పొడిచి జగన్ అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ప్రస్తుతం అదే పందాలో మళ్లీ వెన్నుపోటు దినం పేరుతో ప్రజలను మభ్య పెట్టేందుకు చూస్తున్నారన్నారు. త్వరలో జగన్ జైలుకు వెళ్లేపరిస్థితులు స్పష్టంగా ఉన్నాయన్నారు.. అందుకే వైసీపీ ఈ కపట నాటకాలు ఆడుతోందన్నారు. తిరుమల శ్రీవారిని కూడా వెన్నుపోటు పొడిచిన చరిత్ర వైసీపీకే దక్కుతుందని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఆర్‌సీమునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కుమారమ్మ, కరాఇటే చంద్ర, శ్రీధర్, లలిత, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై 'వెన్నుపోటు' పొడిచింది వైసీపీనే

టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు వట్టికుంట చినబాబు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిపై వెన్నుపోటు పొడిచింది వైసీపీనేనని అన్నారు. వైసీపీ వెన్నుపోటు దినం జరుపుకోవడం అంటే ప్రజలు ఇచ్చిన తీర్పును అవహేళన చేయడమేనని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మధు, రావిళ్ల సుబ్బరాయులనాయుడు, ముని, రామచంద్రారెడ్డి, కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేరుతో కోట్లు కొల్లగొట్టిన వైసీపీ

ఏపీ విద్యార్థి యువజన జేఏసీ చైర్మన్ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఫార్మసీ కళాశాలలకు ఇవ్వాల్సిన బకాయిలు, సంక్షేమ హాస్టళ్లకు అందించాల్సిన మెస్‌చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు ఇంకా అనేక వాటికి నిధులు ఇవ్వకుండా వైసీపీ పాలకులు ఎగ్గొట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, టీడీపీ ఆర్‌సీపురం మండల మాజీ అధ్యక్షులు లీలామోహన్‌నాయుడు, దిలీప్‌రాయల్, రోసిరెడ్డి, మనోజ్, ప్రసాద్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

వ్యర్థాలకు నెలవైన మంగళం-శెట్టిపల్లి రోడ్డు





రోడ్డుపై నిండిపోయిన భవనకట్టడాల వ్యర్థాలు, చెత్తసేకరణ నిల్వ కేంద్రం నిండిపోవడంతో రోడ్డుపై నిల్వ చేసిన చెత్త, ఇతర సామగ్రి

తిరుపతి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మంగళం -శెట్టిపల్లి రోడ్డు డంపింగ్ యార్డుగా మారిపోయింది. కొందరు కూల్చిన భవనాల వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా రోడ్డుకు ఇరువైపులా నింపేస్తున్నారు. దీంతో రోజు రోజుకూ ఆ దారి కుచించుకుపోతోంది. అదేవిధంగా అక్కడ చెత్తసేకరణ కేంద్రం ఉండడంతో వారు కూడా చెత్తను రోడ్డులో ఉంచుతున్నారు. ఫలితంగా కాగితాలు, ఇతరచెత్త గాలికి రోడ్డులో చేరుతోంది. వాహనదారులు కుళ్లిన చెత్త వ్యర్థాల దుర్వాసన భరించలేదకున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డువెంట వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహక రించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. మంగళవారం వారు కలెక్టర్ వెంక టేశ్వర్‌ను వేర్వేరుగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను కలెక్టర్‌కు వివరించారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

నీళ్లు.. నేలపాలు

- పట్టించుకోని పంచాయతీ పాలకులు, అధికారులు

తిరుపతి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మంగళం తిరుమల నగర్ పంచాయితీ పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో తాగునీరు వృధాగా పోతోంది. అయినా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. తుడా క్వార్టర్స్‌లోని ఎల్ఐజీ, ఎంఐజీ నివాసాలకు నీటి సరఫరా కోసం హెచ్‌ఐజీలో వాటర్ పంపింగ్ సెంటర్ ఏర్పాటుచేశారు. నాలుగు బోర్ల ద్వారా నీరు ఈ సెంటర్‌లోని సంపులో నిల్వచేసి మోటారు ద్వారా వాటర్‌ట్యాంకుకు సరఫరా చేస్తారు. అయితే మోటార్లు, పైపులు, గేటువాల్వ్‌లు తప్పుపట్టిపోవడంతో నీరు లీకేజీ అవుతోంది. కొంతకాలంగా దాదాపు రెండు ఇంచీల సామర్థ్యం నీరు నేలపాలవుతోంది. ఈ నీరంతా తుడా పార్కు కోసం కేటాయించిన స్థలంలో చేరి ముడుగులు ఏర్పడ్డాయి. వేసవిలో నీటి కొరత నెలకొన్నా పట్టించుకున్న నాథుడు లేదు. మహిళలు నీటికోసం అనేక తిప్పలు పడ్డారు. అధికారులు స్పందించి గేటు వాల్వ్‌లు, మోటారు, పైపులైన్లు బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.





మోటారు పంపు నుంచి లీకవుతున్న నీరు, మోటారు గది నుంచి వెలుపలికి వస్తున్న నీరు



వృథానీరుతో తయారైన నీటి మడుగులు

గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవ సంబురం





నగరంలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కనులపండుగా వాహనాల సేవలను నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో రెండో రోజు మంగళవారం ఉదయం చిన్నశేష, రాత్రి హంస వాహనాల్లో స్వామి ఊరేగుతుండగా సాగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.





చిన్నశేషవాహనంపై గోవిందుడి చిద్విలాసం





తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఉదయం ఉత్సవర్లు చిన్నశేష, రాత్రి హంస వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవ ముందు కళాకారుల బృందాల కోలాటాలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి.సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ నయనానందకరంగా సాగింది. ఈ కార్యక్రమంలో జీయ్యంగార్లు, డిప్యూటీఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఏవీఎస్వో మోహన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' లో నటిస్తున్నా


● హీరో కార్తీక్ రాజు



'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' అనే సినిమాలో నటిస్తున్నట్టు హీరో కార్తీక్ రాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాటాడుతూ, 'కౌసల్య కృష్ణమూర్తి' సినిమా విడుదలకు ముందు శ్రీవారిని దర్శించుకున్న తనకు మళ్లీ ఇన్నాళ్లకు దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. మరో రెండు ప్రాజెక్టులనూ తాను చేస్తున్నట్టు వెల్లడించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.89 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,418

తలనీలాలు సమర్పించినవారు: 34,900

● విస్తరిస్తున్న టాటా ట్రస్ట్ సేవలు

● స్వీకార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణ

తిరుపతిలో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం





శ్రీవారి పాదాల చెంత టాటా ట్రస్టు ఎంతో సమున్నత ఆశయంతో క్యాన్సర్ ఆస్పత్రిని నెలకొల్పింది. మూడేళ్లు పూర్తి చేసుకుంది. లాభాపేక్ష లేకుండా ఆస్పత్రి నడపాలన్నదే టాటా ట్రస్టు ఉద్దేశ్యం. ఆ దిశగా కృషి చేస్తున్నాం.

అలిపిరి నుంచి జూపార్క్‌కి వెళ్లే దారిలో పచ్చని వాతావరణంలో స్వీకార్ (శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్) ఉంది. టీటీడీ ఈ స్థలాన్ని టాటా సంస్థకు కేటాయించింది. 2018 ఆగస్టు 31న రతన్ టాటాతో కలసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ సంస్థకు భూమిపూజ చేశారు. సుమారు రూ200 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో మూడేళ్లుగా క్యాన్సర్ ఆస్పత్రి నడుస్తోంది. ఈ ఆసుపత్రి అందిస్తున్న సేవల గురించి, ఇక్కడ ఉన్న ఆధునిక సాంకేతిక వైద్య పరికరాల గురించీ స్వీకార్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్‌తో ఆంధ్రజ్యోతి జరిపిన సంభాషణలోని ముఖ్యాంశాలు ఇవి..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అత్యాధునిక పరికరంతో రేడియో థెరపీ

టాటా ట్రస్టుపై ఉన్న నమ్మకంతో రోగులు ఎక్కడెక్కడ నుంచో వెతుక్కుంటూ ఆస్పత్రి కి వస్తున్నారు. ప్రారంభంలో రోజుకు 30 మంది వచ్చేవారు. ఇప్పుడా సంఖ్య 350కి చేరుకుంది. ఆసియాలోనే అధునాతన లీనియర్ యాక్సిలరేటర్ టాటా ఆస్పత్రిలో ఉంది. ఏపీలో ఏ ఆస్పత్రిలో ఇటువంటిది లేదు. రూ. 20 కోట్లు విలువ చేసే ఈ పరికరం ద్వారా రేడియో థెరపీ అందిస్తున్నారు. 2ఎంఎం ఉండే చిన్న చిన్న బ్రెయిన్ ట్యూమర్స్‌ను కూడా ఈ పరికరం ద్వారా కరిగించేవీలుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.



90 శాతం ఉచితమే : స్వీకార్‌లో 80 శాతం ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్ రోగులే ఉంటారు. మరో 10 శాతం మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారానూ, దాతల సహకారంతోనూ చికిత్స అందిస్తున్నాం. అనంతపురం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలనుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక నుంచి కూడా పేషెంట్లు వస్తున్నారు. నెలకు 150 సర్జరీలు, 1200 కీమో థెరపీలు, 80 రేడియో థెరపీలు చేస్తున్నాం. మా సంస్థలో పెట్‌సిటీ సౌకర్యం ఉంది. నోటిద్వారా వచ్చే క్యాన్సర్లు, రొమ్ము, ఓవరీ, కడుపు, ఊపిరితిత్తులు క్యాన్సర్లతో ఇక్కడికి ఎక్కువమంది వస్తున్నారు. ప్రస్తుతం బ్రెయిన్ ట్యూమర్స్‌కు చికిత్స, ట్రాన్స్‌ప్లాంటేషన్ స్వీకార్‌లో చేయడంలేదు. పిల్లలకు క్యాన్సర్ చికిత్స త్వరలో అందుబాటులోకి రానుంది. బ్లడ్ క్యాన్సర్ కేసులు కూడా ఇప్పుడు చూస్తున్నాం.

స్వీకార్ డైరెక్టర్ మన తిరుపతివాసి డాక్టర్ ప్రశాంత్

ప్రతిష్టాత్మకమైన స్వీకార్ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్‌ది తిరుపతి. మూడో తరగతి వరకు తిరుపతిలో, ఆతర్వాత 10వరకు ఊటీ బోర్డింగ్ స్కూల్‌లో చదివారు. నెల్లూరు నారాయణలో ఇంటర్ అయ్యాక మంగళూరులోని కస్తూర్బ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేశారు. వైజాగ్‌లోని ఆంధ్ర మెడికల్ కాలేజ్‌లో ఎంఎస్ పూర్తిచేశారు. ముంబైలోని టాటా మెమోరియల్ ఆస్పత్రిలో ఎంసీహెచ్ (సర్జికల్ అంకాలజీ) చేసిన డాక్టర్ ప్రశాంత్.. న్యూయార్క్‌లో రొబోటిక్ థొరాసిక్ సర్జరీపై శిక్షణ తీసుకున్నారు. పుదుచ్చేరిలోని జిప్‌మర్‌లో పదేళ్లపాటు సర్జికల్ ఆంకాలజిస్ట్‌గా పనిచేశారు. థొరాసిక్ సర్జరీ, హెడ్ అండ్ నెక్ అంకాలజీ, పెరిటోనియల్ సర్ఫేస్ మాలిగ్నన్సీల్లో ప్రత్యేక నిపుణుడుగా డాక్టర్ ప్రశాంత్‌కు పేరుంది. ఈయన తల్లి సులోచనమ్మ తిరుపతిలో వేలాది మందిని నర్సులుగా తయారు చేసిన విద్యావేత్త. సోదరుడు ప్రవీణ్ ఎడిపై స్కూలు నడుపుతున్నారు. భార్య డాక్టర్ లక్ష్మీసంధ్య, స్వీకార్ లోనే మెడికల్ అంకాలజీ విభాగంలో పనిచేస్తున్నారు.





అత్యాధునిక ఎమ్మారై పరికరం - మామోగ్రఫీ పరికరం

క్యాన్సర్ గుర్తించేందుకు క్యాంపులు

60 నుంచి 70 శాతం మంది కేన్సర్ 3 లేదా 4వ స్టేజ్‌లో వస్తున్నారు. ఇంకా ముందే గుర్తిస్తే చికిత్సకు వీలవుతుంది. అందుకే స్క్రీనింగ్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాం. రోగుల వద్దకే వెళ్లి పరీక్ష చేస్తున్నాం. లక్షణాలుంటే ఆస్పత్రికి రెఫర్ చేస్తాం. ఇప్పటివరకు 805 క్యాంపులు నిర్వహించాం. వీటి ద్వారా 50వేల మంది రోగులను పరీక్షించగా 468మందిలో కేన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించాం. వారిలో 42 మందికి నిర్ధారించి, 40మందికి చికిత్స అందించాం.

లుకేమియాకీ చికిత్స



అధునాతన పద్ధతులతో కీహోల్ లంగ్ ఆపరేషన్లు, హైపాక్, బైపాక్ ప్రొసీజర్లు, ఐసీయూ, క్రిటికల్ కేర్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీలు, కాలు నుంచి ఎముక తీసి ముఖానికి పెట్టడం వంటివి స్వీకార్‌లో చేస్తున్నాం. ఈ ఏడాది నుంచి ఇమ్యునోథెరపీ కూడా ప్రారంభించాం. బ్రెయిన్‌లో ఎక్కడ క్యాన్సర్ గడ్డ ఉందో అక్కడే రేడియేషన్ (ఫోకస్డ్ రేడియేషన్)ఇచ్చే విధానం ఉంది. నాలుగు నెలలుగా లుకేమియాకు వైద్యం ప్రారంభించాం. అక్యూట్ క్యాన్సర్ వాళ్లకు అవసరమైన డయాలసిస్ యూనిట్‌ను కూడా ప్రారంభించాం. మరీ ముఖ్యంగా పాలేటివ్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. చివరి దశలో ఉన్న రోగులకు పాలేటివ్ కేర్‌లో అంకితభావంతో పనిచేసే సిబ్బంది మా సంస్థలో ఉన్నారు.

"వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స ఇచ్చేదానికన్నా ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడంతో చాలావరకు కేన్సర్‌ను నిరోధించవచ్చు. పింక్ బస్సు మెడికల్ మొబైల్ యూనిట్ ద్వారా ఆ పనిచేస్తున్నాం.ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. ఇందువల్ల మహిళల్లో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధిని గుర్తించి తొలిదశలోనే చికిత్స అందించగలుగుతున్నాం."

రూ.4,500లుకే క్యాన్సర్ వ్యాక్సిన్

స్వీకార్‌లో సర్వైకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. 9 నుంచి 14 ఏళ్ల వరకు పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వడానికి సరైన వయసు. మగవాళ్లు కూడా ఈవ్యాక్సిన్ వేసుకోవచ్చు. వారికి అనస్, నోటి క్యాన్సర్లు నిరోధించవచ్చు. పెళ్లికి ముందు 30 ఏళ్ల దాకా కూడా వేసుకోవచ్చు అమ్మాయిలు 3 డోసులు, అబ్బాయిలు 2 డోసులు వేసుకోవాల్సి ఉంటుంది. ఒక డోసు ఖరీదు రూ4.5వేలు. కార్పొరేట్ ఆస్పత్రుల్లోకన్నా తక్కువ. ప్రజల్లో అవగాహన పెరగడం వలన సర్వైకల్ క్యాన్సర్ కేసులు గత పదేళ్లతో పోలిస్తే చాలా తగ్గుతున్నాయి.

చెరువులో దిగి గల్లంతైన పాడి రైతు



చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసనమాల గ్రామానికి చెందిన దొడ్డగా శ్రీనివాసులు (55) పశువుల కోసం చెరువులో దిగి గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన దొడ్డగా శ్రీనివాసులు భార్య మాధవితో కలసి పశువులను మేపేందుకు చెరువుకట్టపైకి వెళ్లారు. సాయంత్రం పశువులను ఇంటికి తీసుకొస్తుండగా ఆవుదూడ చెరువులోకి దిగింది. దూడను గట్టుమీదకు తీసుకొచ్చేందుకు శ్రీనివాసులు చెరువులోకి దిగాడు. ఆవుదూడ కాస్త లోతులోకి వెళ్లడంతో శ్రీనివాసులు ముందుకెళ్లి భార్య మాధవి కళ్లెదుటే నీటమునిగి గల్లంతయ్యాడు. చెరువు నీటిలో మునిగిపోయిన భర్త బయటకు రాకపోడంతో మాధవి కేకలు వేస్తూ గ్రామానికి చేరుకుని బంధువులకు తెలిపింది. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఎస్ఐ నాగరాజు, వీఆర్వో భూధనం రమేష్, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరితో పాటు అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని శ్రీనివాసులు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం కనిపించకపోవడంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

యోగాంధ్రలో భాగస్వాములు కండి : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో బుధవారం ఉదయం జరిగే యోగాంధ్రలో భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం పిలుపునిచ్చారు. యోగా కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు 2వేల మందికి పైగా పాల్గొంటారన్నారు. అందుకు సంబంధించిన మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు.

65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే రేషన్

65 సంవత్సరాలు నిండిన వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులను ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన వారు రేషన్ దుకాణానికి రావాల్సిన అవసరం లేదని డీలర్లే ఇంటి వద్దకు తెచ్చిస్తారన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు వద్దన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలు రీఓపెన్‌కు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మీ ఇళ్లను కూడా ఇలాగే ఉంచుకుంటారా...?

● ఆర్టీసీ పారిశుధ్య కార్మికులను మందలించిన జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది ప్రయాణీకులు వచ్చే ఆర్టీసీ బస్టాండ్ ఇలానేనా ఉండాల్సింది... ఇక్కడ ఎటుచూసినా చెత్త కనిపిస్తుంది... ఇలా ఉంటే ప్రయాణీకులకు రోగాలు రావా... ఇక్కడ కార్మికులు ఎవరో పిలిపించండంటూ ఆ సంస్థ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోట ఆర్టీసీ బస్టాండ్‌లో బీజేపీ నాయకులు, ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన గంట పాటు తనిఖీలు చేశారు. బస్టాండ్‌లోకి రాగానే ప్రాంగణం అంతా చెత్తాచెదారంతో నిండి ఉండటం, మరోపక్క నక్కలోళ్లు ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పడేయటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాకాడు ఆర్టీసీ డీఎం చిన్నపెంచలయ్యను పిలిపించి ఆర్టీసీ ప్రాంగణంలో నక్కలోళ్లను బయటకుపంపి శుభ్రం చేయించాలని కోరారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారికి ఫోన్‌చేసి నక్కలోళ్లను వెంటనే బయటకుపంపాలని కోరారు. మహిళల మరుగుదొడ్లకు గోడలపైన రేకులు లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి మీ ఇళ్లల్లో ఆడవాళ్లను ఇలాగే చూసుకుంటారా అని అక్కడ మరుగుదొడ్లను శుభ్రంచేసే కార్మికులను ప్రశ్నించారు. ఇలాగే కొనసాగితే కాంట్రాక్టర్ అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఎలాంటి వ్యర్థాలు వేయకూడదని, ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ డిపోల్లో 3వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కొత్తగా 950 బస్సులు కొనుగోలు చేసి, వాకాడు డిపోకు 14 బస్సులు ఇస్తామన్నారు. అన్ని డిపోలలో ఎలక్ట్రిక్ బస్సులు నడపనున్నట్లు సురేష్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, నాయకులు గిరిధర్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, అంబరీషా, ఆర్టీసీ కార్మికులు ఉన్నారు.



కోట ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్య కార్మికులను ప్రశ్నిస్తున్న జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

వెన్నుపోటు దినం ఎందుకు?

● వైసీపీ నేతలకు చంద్రగిరి ఎమ్మెల్యే సూటి ప్రశ్న ● సైకో పాలన విముక్తికి ఏడాది పూర్తయిందన్న నాని

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రజలకు జూన్ 4వ తేది పండుగ రోజు. కానీ వైసీపీ వారు మాత్రం వెన్నుపోటు దినమని చెబుతున్నారు. వెన్నుపోటు దినం ఎందుకు? ఐదేళ్ల వైసీపీ పాలనలో హౌసింగ్ పేరుతో తూతుమంత్రంగా స్థలాలు చూపి ఇల్లు కట్టనందుకా? ఒకేసారి పింఛను పెంచకుండా మోసం చేసినందుకా? ప్రజలకు మీరిచ్చిన హామీలను నెరవేర్చనందుకా? తల్లిని, చెల్లిని బయటకు పంపినందుకా? మద్యనిషేధం, మెగా డీఎస్సీ చేయకుండా చేసినందుకా? బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ నిధులు మళ్లించినందుకా? బాబాయిని గొడ్డలి వేటుతో నరికినందుకా? ఎందుకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నారు' అని వైసీపీని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి కబంధహస్తాల నుంచి.. సైకో పాలన నుంచి నేడు ప్రజలకు విముక్తి కలిగిన రోజు జూన్ నాలుగో తేది అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. దీనికి ఏడాది పూర్తయినట్లు తెలిపారు. ప్రజలు 11 సీట్లతో తీర్పు ఇచ్చినా వైసీ పీనాయకుల్లో మార్పు రాలేదన్నారు. వెన్నుపోటు దినం పేరుతో ఘర్షణ వాతావరణం సృష్టించాలన్నదే వైసీపీ ప్లాన్ అన్నారు.సూపర్‌సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయలో జరిగిన దాడి, తుడాలో అవకతవకలపై మీడియా వారు ప్రశ్నించగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సమాధానం చెప్పారు. యోగాడేను బుధవారం ఉదయం చంద్రగిరి కోట వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

'గొడ్డలి పోటు' దినం నిర్వహించండి

తిరుపతి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ వెన్నుపోటు కాకుండా గొడ్డలిపోటు దినోత్సవంగా నిర్వహిస్తే బాగుండేదని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని లూటీ చేసిన వైసీపీ ఎన్డీఏ కూటమి పాలనను విమర్శించే అర్హత లేదన్నారు. వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలికి.. ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరి ఏడాదైన సందర్భంగా బుధవారం పండుగలా వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటలకు తిరుపతి నగరం ఎస్టీవీ నగర్‌లో ముగ్గులపోటీ, సాయంత్రం ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయం వద్ద దీపాలు వెలిగించడంతో పాటు టపాకాయలు కాల్చనున్నట్లు చెప్పారు.

వెన్నుపోట్లతా జగన్ కుంటుంబంలోనే..

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోట్ల చరిత్ర చూసుకుంటే జగన్ ఇంట్లోనే ఉన్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ మంగళవారం అన్నారు. మంగంపేట మైన్స్ హత్యల నుంచి పీవీ నరసింహ రావు మీద చెప్పులు విసిరే దాక, ఆస్తుల కోసం చెల్లెలిని వదిలేసిన విధానం, వివేకానందరెడ్డి హత్య.. ఇలా వెన్నుపోట్లతోనే నిండి ఉందన్నారు.

పది మంది టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

తిరుపతి, జూన్3(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన పది మంది టీడీపీ నేతలపై నమోదైన ఎన్నికల ఉల్లంఘన కేసును అదనపు జూనియర్ సివిల్ జడ్జి మంగళవారం కొట్టివేశారు. 2019 సాధారణ ఎన్నికల్లో ప్రచారానికి అధికారుల వద్ద ముందస్తు అనుమతి తీసుకోలేదని తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్మన్ మన్నూరు సుగుణమ్మ, టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, బి.జి. కృష్ణ యాదవ్, డాక్టర్ సుధారాణి, పుష్పావతి, డాక్టర్ ఆశాలతపై కేసు నమోదైంది. సుదీర్ఘ విచారణ అనంతరం వీరిని నిర్దోషులుగా నిర్ధారించి కేసు కొట్టివేశారు. ఈ కేసును టీడీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ దినకర్, సత్యశ్రీవాసన్ వాదించారు.



ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కొండేపాటి గంగాప్రసాద్

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పుట్టిన రోజు కార్యక్రమాలను మంగళవారం గూడూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపం నుంచి టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యేకు క్రేన్ సాయంతో గజమాలలను వేసి బ్యాండుమేళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అండదండలు, ఆశీస్సులతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ సహకారంతో తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. తనపై ఆదరణ చూపుతున్న ప్రజలకు రుణ పడిఉంటానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు, నోటు పుస్తకాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. వివిధ ప్రాంతాల్లో నాయకులు అన్నదాన, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కరరెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఆరకట్ల మస్తాన్ నాయుడు, లీలావతి, పూడిపర్తి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, జనార్దన్‌రెడ్డి, చిట్టేటి కీరవాణి, వాటంబేడు శివకుమార్, పేటేటి చంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు చరిత్ర జగన్‌దే

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల



మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు

నాయుడుపేట టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు చరిత్ర జగన్‌దేనని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెన్నుపోటు దారుడు జగన్ వెన్నుపోటు కార్యక్రమాన్ని నిర్వహించడం సిగ్గుచేటని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని తిరస్కరిస్తారని అన్నారు. వెన్నుపోటుకు, గొడ్డలివేటుకు పేటెంట్ జగన్‌మోహన్‌రెడ్డి అని అభివర్ణించారు. కంటికి రెప్పలా పెంచిన నీ బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డికి వెన్నుపోటు పొడిచావని ఆరోపించారు. దీనికి భయపడి నీ తల్లి, చెల్లి సైతం నీవద్దకు రావడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక పనులకు పాల్పడుతున్న వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో ప్రజలు అధిక సీట్లలో గెలిపించారని చెప్పారు. ఆ నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు వంటి పథకాలను ఆగస్టు లోపల అమలుపరిచేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫీ, విజయకుమార్ నాయుడు, మురళీకృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, పొట్లపూడి రాజేష్, చెంచయ్య, అవధానం సుధీర్, గంగాప్రసాద్, రాజేంద్ర, సుబ్బారావు, పెనల కిషోర్‌బాబు, మస్తాన్, నారాయణ తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనలో ఆర్టీసీ అస్తవ్యస్తం


● జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



వాకాడు ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

వాకాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారడంతోపాటు అభివృద్ధికి నోచుకోలేదని ఆ సంస్థ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి విమర్శించారు. వాకాడు ఆర్టీసీ డిపోను మంగళవారం బీజేపీ నాయకులతో కలసి ఆయన తనిఖీ చేశారు. డిపో ఆవరణం అంతా పరిశీలించి పారిశుధ్య పనులను సరిగ్గా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. రోడ్లు సరిగ్గా వేయకపోవడంతో బస్సులు మరమ్మతులకు గురయ్యాయన్నారు. వాకాడు ఆర్టీసీ డిపోకు నూతనంగా 14 ఎక్స్‌ప్రెస్‌లను తీసుకువచ్చామన్నారు. కోట నుంచి తిరుపతి, తిరుమలకు నిరంతరాయంగా 5 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. వాకాడు బస్టాండ్ గతుకులమయంగా ఉందని, మరమ్మతులు చేయిస్తామన్నారు. ఉదయం 4 గంటలకు త్వరలో పొద్దుటూరుకు బస్సు రూట్ మ్యాప్ వేసేలా చూస్తామన్నారు. డిపోలో పరిశుభ్రత పెంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పెంచలయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు పామాంజి కృష్ణయ్య, వాకాటి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీల్‌కు సైకత శుభాకాంక్షలు



ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సైకతశిల్పాన్ని రూపొందిస్తున్న సనత్‌కుమార్

చిల్లకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మంగళవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ ఎమ్మెల్యే సైకత శిల్పాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు. సనత్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే 30 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ సైకత శిల్పాన్ని తమ్మినపట్నం గ్రామానికి చెందిన కోట సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించినట్లు చెప్పారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో రవికృష్ణ, సభ్యులు గోపాల్, శ్రీరంగ, ఆలయ అర్చకులు వాచస్పతి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ చోరీ యత్నం

వెంకటగిరిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలేరమ్మ ఆలయ హుండీ సోమవారం అర్ధరాత్రి 2గంటలకు చోరీ చేసేందుకు దుండగులు యత్నించారు. రాత్రి సమయంలో ఈ హుండీ మార్కెట్ వీధిలో ఉండడాన్ని చూసిన స్థానికులు దానిని యథావిధిగా పోలేరమ్మ ఆలయంలో ఏర్పాటు చేశారు. హుండీలో ఎటువంటి అపహరణ జరగకపోవడంతో ఆలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

థియేటర్లల్లో తనిఖీలు

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని అరుణ, ఆర్ఆర్‌సి థియేటర్లల్లో మంగళవారం తహసీల్దారు జయజయరావు తనిఖీలు నిర్వహించారు. ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు శ్రీనివాసులు, రమణయ్య థియేటర్లలో ప్రేక్షకులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ స్థలాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు థియేటర్ యజమానులను హెచ్చరించారు.

పీఎంఏజేవై ద్వారా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

● వైసీపీ హయాంలో ఆగిన పనులకు కూటమి సర్కార్ చొరవ

సూళ్లూరుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కింద 2021లో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం మండలాల్లోని 10 గ్రామాల్లో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. వైసీపీ పాలనలో సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పట్లో గ్రామ సర్పంచులు ఈ పథకాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో నిధులు మంజూరైన ఒక్కచోట కూడా ఆర్వో ప్లాంటు ఏర్పాటుకాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఈ పథకంలో కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట మండలం ఇలుపూరు, దొరవారిసత్రం మండలం పూలతోట, కొత్తపల్లి రెండు చోట్ల ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. సర్పంచులు ముందుకురావడంతో ఈ ప్రాంతాల్లో శరవేగంగా పనులు జరిగి ప్రజలకు శుద్ధజలం అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరందించాలనే ఉద్దేశంతో ఒక్కొక్క ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తోంది. గ్రామంలో ప్లాంట్‌తో పాటు ఇతర సామగ్రి కొనుగోలు, విద్యుత్ తదితరాల కోసం రూ.5 లక్షలు, భవన వసతి కోసం రూ.3 లక్షలు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వ చొరవతో 2024-25 ఆర్థిక సంవత్సరం చివరికల్లా మంజూరైన చోట ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు సర్పంచులు ముందుకు వస్తున్నారు. ఈ మేరకు అధికారులు కూడా సన్నాహాలుచేస్తున్నారు. వైసీపీ హయాంలో ఆగిన పనులను కూటమి సర్కార్ చొరవతీసుకుని పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం విశేషం.



నీటిని శుద్ధిచేసే పరికరాలు, ట్యాంకు



ఇలుపూరులో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్

క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేకచర్యలు

● శాప్ చైర్మన్ రవి నాయుడు

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వస్టేడియంలో నూతనంగా నిర్మిస్తున్న గ్యాలరీ, ఓపెన్ జిమ్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలసి ప్రారంభోత్సవం చేశారు. రవి నాయుడు మాట్లాడుతూ గ్రామీణస్థాయి క్రీడాకారుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తుందన్నారు. గూడూరులోని ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియాన్ని అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే పాశం తన సొంత నిధులను వెచ్చించి సహకారం అందిస్తున్నారన్నారు. క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా జిమ్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ స్టేడియంలోకి మురుగునీరు వస్తుండంతో వాకర్స్, క్రీడాకారులు అవస్థలు పడేవారన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా నూతన ప్రహరీగోడ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, వేగూరు రాజేంద్రప్రసాద్, గంటా మధుకృష్ణ, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, మట్టం శ్రావణి, నిమ్మకాయల రవి, సర్వోత్తమరెడ్డి, మునిగిరీష్ పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న రవి నాయుడు, సునీల్‌కుమార్ తదితరులు

స్కిల్‌హబ్ ఏర్పాటు

గూడూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం తెలిపారు. నిరుద్యోగ యువతను గుర్తించి ఆయా ప్రాంతాల్లో గల పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందజేసి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఈ స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ స్కిల్‌హబ్‌లో అసిస్టెంట్ టెక్నీషియన్ స్ట్రీట్‌లైట్ ఇన్‌స్టాలేషన్, ఎలక్ట్రికోహెవికల్ అసెంబ్లీ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8639835953 నంబరును సంప్రదించాలని తెలిపారు.

'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయండి

వెంకటగిరిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రాపూరు కేంద్రంగా వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెంకటగిరి సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, శాతరాసి బాలయ్య, వహిదా, కళ్యాణి, పులి ప్రసాద్‌రెడ్డి, రాధ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు అందించాలి



చిక్కీని పరిశీలిస్తున్న పీడీ వసంతాబాయి

వెంకటగిరిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైనా సరుకులను లబ్ధిదారులకు అందించాలని పీడీ వసంతబాయి అన్నారు. మంగళవారం స్థానిక మొక్కలపాడు, పాళెంకోట, బొప్పాపురం, చెవిరెడ్డిపల్లి, బుసపాళెంలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటరులో పిల్లల హాజరు, లబ్ధిదారులు ఫేస్‌క్యాప్చర్, స్టాక్ నాణ్యత తప్పకుండా ఉండాలన్నారు. కేంద్రాలకు స్టాక్ నాణ్యతగా వస్తేనే తీసుకోవాలన్నారు. అనంతరం కిశోర వికాసం పిల్లలకు బాల్యవివాహాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. వెంకటగిరి మండలంలో టీవీఎస్ ట్రస్టు చేసిన అభివృద్ధిని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ చేయూత ఫౌండేషన్ ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదును అందజేస్తున్న బలిజ చేయూత ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపులో ఓ కుటుంబానికి నాయుడుపేట బలిజ చేయూత ఫౌండేషన్ ఆర్థిక సాయమందించింది. పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటున్న తిరుమల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి మంగళవారం రూ.10వేల నగదును బలిజ చేయూత ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పగడాల శివప్రదీప్, పృధ్వీ, హరికృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణం జరుపుతున్న వేదపండితులు

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని అల్లారెడ్డి శ్యామసుందరపురంలో వెలసి ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం సీతారాముల కల్యాణం జరిపారు. సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి-హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో అర్చక సలహామండలి సభ్యులు దివి అనంతాచారి, నరేష్‌శర్మల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని కన్నులపండువగా జరిపారు. భక్తులు తలంబ్రాల కోసం పోటీపడ్డారు. భక్తులకు స్వామివారి కంకణాలను అందజేశారు. శరవణ, రాధా, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు చీరలు, దుప్పట్ల పంపిణీ

చిట్టమూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని 200 కుటుంబాలకు చెందిన నిరుపేద గిరిజనులకు దుప్పట్లు, చీరలు, బియ్యం, వివిధ రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, ఎస్ఐ చిన్నబలరామయ్య, టీడీపీ నాయకులు జనార్దనరెడ్డి, హరికృష్ణారెడ్డి, సునీల్‌రెడ్డి, చిన్నారావు, రాజేష్‌రెడ్డి, చెంచురామయ్య, ధనంజయ్య నాయుడు, కస్తూరయ్య, రషీద్, బషీర్, సురేష్, పవన్, శ్రావణ్, అంకయ్య తదితరులు ఉన్నారు.

కోటలో...



షాదీమంజిల్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని షాదీమంజిల్‌లో మంగళవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు జరుపుకున్నారు. తిరుపతి జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, రైతు విభాగం కార్యదర్శి నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాళెం సర్పంచ్ కొకర్ల మధుయాదవ్‌ల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, చెంగల్‌రావు, చల్లా సురేష్, వాకా విజయభాస్కర్‌రెడ్డి, కోటేశ్వరప్రసాద్, మర్రి పోలయ్య, చావల శీనయ్య తదితరులు ఉన్నారు.

వాకాడులో...

వాకాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వాకాడులో 8 అడుగుల భారీ బెలూన్‌ను పంత్రాంగం అరుణ్ ఏర్పాటు చేసి ఎగురవేయడంతో టీడీపీ నాయకులు కేరింతలు కొట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో దోసకాయల కృష్ణమూర్తి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, కల్లూరు హరీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల రాజకీయ జీవితంలో

పేదలకు ఎంతో సేవ చేశా

● ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లోకి వచ్చి 30 ఏళ్ల పూర్తి అయ్యాయని, మూడు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఎంతో మంది పేదలకు సేవ చేశాననే సంతృప్తి కలుగుతోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. 1985లో ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకుడిగా, 1987లో ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడిగా, 1989లో ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చైర్మన్‌గా, 1995లో టీడీపీ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా, 2000లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా పని చేశానని చెప్పారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యానని, 2014, 2024 జరిగిన ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. స్థానికుడిని కావడంతో ప్రతి ఒక్కరితో పార్టీలకతీతంగా సఖ్యతగా ఉంటూ, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు సహకరిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడిఉంటానని ఎమ్మెల్యే తెలిపారు.

వైభవంగా బంగారమ్మ జాతర



శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో కొలువై ఉన్న బంగారమ్మ ఆలయంలో మంగళవారం జాతర వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకించారు. ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అంబలి పోశారు. ఉదయం 9గంటలకు గెరిగ ఉత్సవం ప్రారంభించారు. వాయిద్యాలన నడుమ గ్రామోత్సవం చేశారు. ఉదయం మైలు ముగ్గు, మధ్యాహ్నం పోతురాజు ముగ్గు వేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ వనమాల నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

రోగులతో కిక్కిరిసిన ఆరోగ్యకేంద్రం



చికిత్స పొందుతున్న గ్రామస్తులు

కేవీబీపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంగళవారం రోగులతో కిక్కిరిసిపోయింది. వాతావరణంలో మార్పుల కారణంగా పలువురు గ్రామస్తులు విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందారు. మంగళవరం ఒక్కరోజే సుమారు 200మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రామ్‌నాయక్ మాట్లాడుతూ... నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. అలాగే మసాలాల వినియోగం తగ్గించి తేలికగా జీర్ణమయ్యే ఆకుకూరలు, కూరగాయలతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో చరిష్మా ప్రతిభ



శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీలో ప్రవేశాలకు నిర్వహించిన జే ఈ ఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో ఎంజీఎం జూనియర్ కళాశాల విద్యార్థిని గోరంట్ల చరిష్మా ఆల్ ఇండియా స్థాయిలో 4120 ర్యాంకు సాధించింది. మంగళవారం కళాశాల ఆవరణలో డైరెక్టర్ మయూర్ ఆమెను అభినందించారు. కళాశాల ఏవో మహదేవన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధితో సెక్యూరిటీ గార్డు మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఓ సెక్యూరిటీ గార్డు మూర్ఛవ్యాధితో మృతి చెందాడు. మండలంలోని అలత్తూరుకు చెందిన పసల సాంబయ్య (45) గ్రామ సమీపంలో ఉన్న శ్రీనిధి రాజా అట్టల పరిశ్రమలో 11 రోజుల క్రితం సెక్యూరిటీ గార్డుగా చేరారు. సోమవారం డ్యూటీ ముగించుకుని ఫ్యాక్టరీలోని గదిలో విశ్రాంతి కోసం వెళ్లగా మూర్ఛ వ్యాధి కుప్పకూలాడు. సహచరులు ఆయన్ను శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టరు తెలిపారు. దీంతో సాంబయ్య బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు సిబ్బందితో గ్రామానికి చేరుకుని మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. వారు మృతదేహాన్ని తీసుకెళ్లి ఫ్యాక్టరీ ముందు పెట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ, ఎస్ఐ సిబ్బందితో ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని సాంబయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచించారు. సాంబయ్యకు భార్య ఇద్దరు పిల్లలున్నారు.

ఆటో ఢీకొని కూలిన విద్యుత్ స్తంభం



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూళ్లూరుపేట రోడ్డులో నీర్పాకోట బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీ కొనింది. దీంతో స్తంభం కూలి వైర్లు తెగిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ చలపతి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

నారాయణవనం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధ్యమని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని అరణ్యం కండ్రిగ, నైనారు కండ్రిగల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో డ్రోన్లు, భూసార పరీక్ష పత్ర వినియోగం, కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. 50 శాతం రాయితీతో జనుము, జీలగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ రమేష్ చెప్పారు. పశువైద్యాధికారి కుమార్, ఉద్యానవన అధికారి సౌజన్య, గ్రామ వ్యవసాయ సహాయకులు, మాస్టర్ ట్రైనర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారూరు, అడవికొడియం బేడు, గోవర్ధనగిరి, పిచ్చాటూరుల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు దివ్య, సుమంత్ ఖరీఫ్‌లో నూతన రకాల సాగు, యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యం, డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఏవో సంజీవరెడ్డి, జిల్లా శిక్షణ కేంద్రం అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సంజయ్‌మూర్తికి సాదర వీడ్కోలు



రేణిగుంట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సంజయ్‌మూర్తికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సాదర వీడ్కోలు పలికారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సంజయ్‌మూర్తి తిరుగు ప్రయాణంలో తిరుపతి విమానాశ్రయం చేరుకోగా, ఆయనకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సాదరంగా వీడ్కోలు పలికారు. ఎయిర్ ఇండియా విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పరిశీలన



ఏర్పేడులో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఈవో కార్యాలయం నుంచి పాఠశాలలకు సరఫరా అవుతున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీ శంకర్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని ఉన్నత పాఠశాలలకు పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ అయినట్లు ఎంఈవోలు వివరించారు. అక్కడినుంచి ఆయన ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం ఆటిజం సెంటర్ ఏర్పాటుకు అవసరమైన తరగతి గదుల కోసం తెలుగు గంగ కాలనీలోని ఏపీటీ డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. అవసరమైన సదుపాయాల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర మండల స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్ పరిశీలించారు. అదే విధంగా మండలానికి మంజూరైన ఆటిజం కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను ఈనెల 3నుంచి పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో దయాకర్ చెప్పారు. అనంతరం భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. రాష్ట్ర సహిత విద్య సలహాదారులు రామ్ కమల్, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ



గోపాల్‌రావు కాలనీలో వృద్ధురాలికి ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందజేస్తున్న డీలర్

వరదయ్యపాళెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకదుకాణ డీలర్లు మంగళవారం వృద్ధుల ఇంటికే వెళ్లి సరుకులు అందించారు. చౌకదుకాణాలకు రాలేని వృద్ధులకు ఇంటి వద్దే సరుకులు అందించే విధంగా టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగా వరదయ్యపాళెంలో పలువురు వృద్ధులకు సరుకులను ఇంటి వద్దే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు మాట్లాడుతూ... గతంలో వాహనాలు ఎపుడు వస్తాయో తెలియక గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేదన్నారు. అది తప్పితే ఆ నెల రేషన్ లేనట్టేనని వాపోయారు. ప్రస్తుతం ఇంటి వద్దకే సరుకులు తెచ్చి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరకులను తహసీల్దార్ టి.వి.సుబ్రహ్మణ్యం, చౌకదుకాణ డీలర్లతో కలసి పంపిణీ చేశారు. మండలంలోని కొత్త గొల్లకండ్రిగ రేషన్‌షాపు డీలర్ గురవమ్మ ఆధ్వర్యంలో వృద్ధురాలు రమణమ్మ ఇంటికి వెళ్లి సరుకులను అందించారు. ఆర్ఐ సుధాకర్, వీఆర్వో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



రేణిగుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యంపై గాజులమండ్యం పోలీసులు మంగళవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మోహన్‌సింగ్, సంగీతాదేవి భార్యాభర్తలు. బతుకుతెరువు కోసం రేణిగుంటకు చేరుకొని పారిశ్రామికవాడలో పనులు చేసుకుంటు తూకివాకం పంచాయతీ పరిధిలోని వినాయకపురంలో కాపురం ఉంటున్నారు గత నెల 25వ తేది పెద్ద కుమారుడు ఆదిత్య(12) పిల్లలతో కలిసి ఆడుకోవడానికి వెళ్తానని చెప్పి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గాలించినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎస్పీబీ పాటల కచేరి

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని ఈనెల 4న బుధవారం జడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో పాటల కచ్చేరి నిర్వహిస్తున్నట్టు మండలి శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి వేణు తెలిపారు.మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10గంటల వరకు కచ్చేరి ఉంటుందన్నారు.

చినుకుపడితే చెరువే...!



సింగమాలలో అండర్‌పాస్ వంతెన కింద స్తంభించిన వర్షపు నీరు

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూడండి. తొట్టంబేడు మండలం చిన్న సింగమాల నుంచి కొమ్మనగుంటకు వెళ్లే రహదారి. ఈ మార్గంలో అండర్‌పాస్ వంతెన కింద చినుకు పడితే వర్షపు నీరు స్తంభించి బురదమయమవుతోంది. సింగమాల వద్ద ఇటీవల ఆరు లేన్ల రోడ్డు విస్తరణ జరిగింది. చిన్నసింగమాల నుంచి కొమ్మనగుంటతో పాటు ఈ మార్గంలో సుమారు 10 గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జి కింది నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొమ్మనగుంట రోడ్డు అండర్‌పాస్ వంతెన నిర్మించారు. అయితే నీరు నిలవకుండా అధికారులు చర్యలు చేపట్టలేదు. దాంతో చినుకు పడితే ఈ ప్రాంతం చెరువును తలపిస్తోంది. రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. వర్షాకాలంలో అయితే ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వీలు పడదు. ఇక్కడి ప్రజలు పక్కనే ఉన్న సర్వీసురోడ్డు నుంచి సుమారు 2 కిలోమీటర్ల పాటు అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. వంతెన కింద నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వెన్నుపోటు గురించి జగన్ మాట్లాడటం విడ్డూరం

ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు గురించి వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెన్నుపోట్ల చరిత్ర చూసుకుంటే అయన ఇంట్లోనే ఉన్నాయన్నారు. రాజకీయ జీవితం అంతా వెన్నుపోట్లకు సాక్షిగా నిలుస్తాయన్నారు. మంగంపేట మైన్స్ హత్యల నుంచి పీవీ నరసింహారావు మీద చెప్పులు విసిరే దాక, చెల్లిని ఆస్తుల కోసం వదిలేసిన విధానం, వివేకానందరెడ్డి హత్య.. ఇలా వెన్నుపోట్లతోనే నిండి ఉందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిలోపే 70శాతం హామీలను అమలు చేసిందన్నారు. ప్రతి వృద్ధుడి ఉదయం 7గంటలకే పింఛను నేరుగా ఇంటి వద్దే అందుతోందన్నారు.

ఘనంగా కీచక వధ

ఏర్పేడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురంలో జరుగుతున్న ద్రౌపది ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళశారం కీచక వధ ఘట్టం ఘనంగా జరిగింది. అనంతరం గ్రామంలో పరివార దేవతల ఊరేగింపు మేళతాళాల మధ్య జరిగింది. సర్పంచ్ మంజుల, మునిరంగారెడ్డి, మునిరత్నంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు... గొడ్డలి పోటుకు దిక్సూచి జగనే: టీడీపీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు.. గొడ్డలిపోటుకు దిక్సూచి మాజీ సీఎం జగన్ అని శ్రీకాళహస్తి పట్టణ టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వెన్నుపోటు పేటెంట్ జగన్‌రెడ్డిదే అన్నారు. జగన్ తాత రాజారెడ్డి ఎదుగుదల హత్యలతో మొదలైందన్నారు. తండ్రి వైఎస్‌ను అడ్డం పెట్టుకుని వేలకోట్లు దోచుకుని కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారన్నారు. సొంత బాబాయిని గొడ్డలి వేటుతో నరికి చంపిన కిరాతకులను కాపాడి రక్తసంబంధానికి వెన్నుపోటు పొడిచారని, ఆస్తికోసం తల్లీచెల్లిని ఇంటినుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచాడన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు 85 శాతం అమలు చేయకుండా వారికి కూడా వెన్నుపోటు పొడిచాడన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గాల్లో రూ.1,200కోట్లు ఖర్చు చేసి 20వేల కిలోమీటర్ల రోడ్డు వేసిందన్నారు. 203 అన్న క్యాంటీన్లు తెరవడం, మత్స్యకారులకు ఇబ్బందిగా ఉన్న 217 జీవోను రద్దుచేశామని తెలిపారు. రంగినేని చెంచయ్యనాయుడు, షాకీరాలీ, కన్నలి ప్రతాప్‌రెడ్డి, గోపి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చడానికే...

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు పాల్పడిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే వైసీపీ ధర్నా డ్రామాలకు తెర లేపిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని వేల కోట్లు దోచుకుని, ఆ పార్టీకే వెన్నుపోటు పొడిచిన జగన్ అసలైన వెన్నుపోటుదారుడన్నారు. రాష్ట్రంలో వెన్నుపోటు, గొడ్డలిపోటుకు పేటెంట్ హక్కులన్నీ జగన్‌కే చెందుతాయన్నారు. ఐదేళ్ళ పాలనలో 85 శాతం హామీలు ఎగనామం పెట్టి, ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వైసీపీ... కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు రామచంద్రయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని రామలింగాపురానికి చెందిన రామచంద్రయ్య సొంత పనుల నిమిత్తం మంగళవారం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో మిట్టకండ్రిగ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామచంద్రయ్యను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. 1వ పట్టణ పోలీసులు ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యకి _(45) మృతి చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని తుఫాన్ సెంటర్ ఎస్టీకాలనీ సమీపంలో కైలాసగిరి కొండల్లో అల్లిమడుగు వద్ద మంగళవారం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు సుమారు 5రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుని వివరాల కోసం ఆరా తీశారు. నలుపు రంగు టీషర్టు, షార్ట్ ధరించి ఎడమచెవికి కమ్మ ఉన్నట్లు ఆనవాలు తెలిపారు.మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని వేణుగోపాలపురం శ్మశాన వాటికలోని ముళ్లపొదల్లో చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకి దించి పరిశీలించారు. వివరాలు ఏవీ లభ్యం కాలేదు. కాగా గుర్తు తెలియన వ్యక్తి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, ఎర్ర నిక్కరు, తెల్లషర్టు వేసుకుని ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించండి

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి కె.మునిచందు, నియోజకవర్గ కార్యదర్శి శివశంకర్ కోరారు. మంగళవారం తహసీల్దారు లక్ష్మీనారాయణకు వసతిగృహ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ ఛార్జీలు విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. బోస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



పూజా సామగ్రిని తీసుకువస్తున్న అధికారులు, అర్చకులు

వడమాలపేట,జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 7 నుంచి 15వరకు నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ నలుమూలలా శుద్ధి చేశారు. నిత్య కైంకర్యాలు, సేవల అనంతరం ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితర వస్తువులను నామకోవు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం తదితర సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో శుద్ధి చేశారు. కార్యక్రమంలో ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



మరమ్మతు చేసిన మోటర్ వద్ద టీడీపీ నాయకులు

వడమాలపేట, 3 జూన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలినాయుడుకండ్రిగ పంచాయతీ మేదరమిట్టలో టీడీపీ నాయకుల చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. సుమారుగా 35 ఇళ్లు ఉన్న ఆ గ్రామంలో రెండు మోటార్ల ద్వారా డైరెక్ట్ పంపింగ్‌తో నీరు సరఫరా అవుతోంది. 20 రోజుల వ్యవధిలో రెండు మోటర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో టీడీపీ నాయకులు చొరవ తీసుకోని సమస్యను ఎంపీడీవో శేషగిరిరావు దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో ప్రత్యేక గ్రాంట్ ద్వారా రూ.80 వేలతో రెండు మోటర్లను మరమ్మతులు చేయించారు. మంగళవారం వాటిని బోర్లకు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, నాయకులు దేవ, భాను ప్రకాష్, మురళి ఆచ్చారి, గురవయ్య, ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలు జగన్‌కే సాధ్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ బీసీ సంఘం నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అయిన వారికి ద్రోహం చేయడం, నమ్ముకున్న వారిని నాశనం చేయడం వంటి వెన్నుపోటు రాజకీయాలు మాజీ సీఎం జగన్‌కే సాధ్యమని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు విమర్శించారు. టీడీపీ బీసీ విభాగం నాయకులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. నికార్సైన అరాచకవాదిగాపేరు తెచ్చుకున్న జగన్ ప్రజాతీర్పును వెన్నుపోటు దినంగా చెప్పడం వారిని అవమానించినట్లేనన్నారు. జూన్ 4వ తేదీన ప్రజలు జగన్ విముక్త దినంగా సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రజావేదికతో మొదలైన ఆయన విధ్వంసక పాలన అమరావతి రైతులను క్షోభపెట్టడంతో పాటు పారిశ్రామిక వేత్తలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లేలా వరకు అరాచక పాలన సాగించారన్నారు. దళితులైన డాక్టర సుధాకర్, వరప్రసాద్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల నాగమ్మ తదితరుల మరణాలకు కారణమైన వారిని ప్రోత్సహించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ సంఘం డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు గాలి మురళినాయుడు, పేట బాలాజీరెడ్డి, మునిరాజాయాదవ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, భాస్కర్‌ముదిరాజ్, రాఘవులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము పంపిణీ



బాధితులకు బీమా సొమ్ము అందజేస్తున్న నాగబాబు

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో మరణించి జనసేన క్రియాశీల సభ్యుల కుటుంబాలకు ఎమ్మెల్సీ నాగబాబు చెక్కులను అందజేశారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలుకు చెందిన జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడు శ్రీనివాసులు, ఏర్పేడు మండలానికి చెందిన రాజేష్ ప్రమాదవశాత్తు మరణించారు. మంగళవారం మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలో నాగబాబు చేతులమీదుగా వారి కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేశారు. జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, డి.రాఘవయ్య, చంద్ర పాల్గొన్నారు.

సిగ్నల్ లైట్ సమీపంలో అడవికి నిప్పు

రేణిగుంట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విమానాలకు సిగ్నల్ చూపే లైటు సమీపంలో అడవికి నిప్పంటుకుంది. ఈ ఘటన మండలంలోని వెంకటాపురం కొండపైన జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి నిప్పు రవ్వలు ఎగబడుతున్నాయి. దీన్ని గుర్తించిన అటవీ శాఖ సిబ్బంది మధ్యాహ్నం నిప్పును ఆర్పినా రాత్రి వీచే గాలులకు నిప్పు అంటుకుంది.

రైల్వేస్టేషన్ సమీపంలోని హోటళ్లకు నోటీసులు

రేణిగుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని తిరుమల బస్టాండ్‌లో దుర్వాసన వెదజల్లుతుండడంపై పంచాయతీ కార్యదర్శి హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణికులు సహా శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు దుర్వాసన భరించలేకపోవడంపై 'పారిశుధ్య చర్యలు చేపట్టండి సారూ' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మణి రైల్వేస్టేషన్ ఆవరణలోని హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసారు. సోమవారం లోగా పంచాయతీ కాలువపై సిమెంట్ కట్టడాలను తొలగించాలని పేర్కొన్నారు.